# బొగ్గుల బట్టి

ఆ కొండ పాదాల వద్ద - కంప చెట్ల చాటున్నించి బెదిరే కుందేళ్లతోనో, నేలకేసి కొట్టిన బంతిలా గెంతే జింకలతోనో, చూపులకు సహజ పరిచయం అబ్బినట్లే - రంగమ్మతో పరిచయమైంది మస్తాన్ రెడ్డికి.

సావిచెట్టు పల్లె రిజర్వ్ ఫారెస్టుకు యివతల బొగ్గు కాల్పిస్తున్నాడు అతను.

కంప పొదల్ని నరికించి, ఆ బిడువులో మూడంకణాల కొట్టం వేయించి, కూలీల్ని పరిచయం చేసి. అక్కడి అజమాయిషీ అతనికి అప్పగించి, తను సగిల్లో పల్లెలకు బొగ్గు కాల్పించేందుకు వెళ్లాడు మస్తాన్‌రెడ్డి తండ్రి.

భరణి దాటి కృత్తిక కార్తె వచ్చింది. ఎండలు బాగా ముదిరాయి. ఉదయపు చల్లదనాన విన్పించే కోయిల గొంతు మధ్యాహ్నమయ్యేసరికి ఏ చెట్టు ఆకుల మాటున్నో అదృశ్యమవుతోంది. సాయంత్రానికంతా ఎండలు ప్రచండవేగంతో కమ్ము కొస్తున్నాయి.

బట్టీల వద్ద కూలీలు పన్జేస్తున్నారు. నల్లటి వాళ్ల దేహం చెమట చిత్తడితో నిగనిగ మెరుస్తోంది.

మగ కూలీలు రెమ్మలు చెలగి కట్టెల్ని వేరుజేస్తోంటే, ఆడ కూలీలు వాటిని బట్టీల వద్దకు మోస్తున్నారు.

మస్తాన్‌రెడ్డి డ్యూటీ ఎక్కి అది రెండవ రోజు.

ప్రాంతం కొత్తదయినా, మనుషులు కొత్తవాళ్లయినా, బొగ్గు కాల్పించే పని మాత్రం అతనికి కొత్తకాదు.

కొట్టం ముందు వసారాలో మంచమ్మీద కూచుని పనికేసి చూస్తున్నాడు.

తమ కొత్త యజమానిని గురించీ, అతని కోరమీసాల్ని గురించీ, రింగుల జుత్తు గురించీ, శరీర ఛాయ గురించి, వెరసి అతని స్ఫురద్రూపాన్ని గురించి తమలో తాము చర్చించుకొంటూ పన్జేస్తున్నారు కూలీలు.

వాళ్ల వెనగ్గా ఎత్తైన నల్లమల కొండల మీది పచ్చదనం వాళ్ల శరీరాల్లాగే కమిలి పోతోన్నట్లుంది.

సాయంత్రానికి బట్టీకి సరిపడే కఱ్ఱ మోశారు వాళ్లు.

సాయంత్రం దాకా వసారా కింద మంచమ్మీంచి లేవలేదు అతను. వెంటతెచ్చుకున్న నవల చదువుకుంటూ, మధ్య మధ్య కూలీలకేసి చూస్తూ పొద్దు పుచ్చాడు.

కఱ్ఱమోసే ఆడ కూలీల మధ్యనించి అప్పుడప్పుడు ఓ పదునైన చూపో, మరో చిరునవ్వో, యింకో పెదవి పీడనమో అస్పష్టంగా తనకేసి వస్తున్నట్లే అన్పించినా – కోర మీసాల్ని మెలేసుకొంటూ అంతగా పట్టించుకోలేదు మస్తాన్‌రెడ్డి.

మరో రెండ్రోజులగ్గానీ వాటి పూర్తి స్వరూపాన్ని అర్థం చేసికోలేకపోయాడు.

పోతూ పోతూ చూపుల్ని అతని కనుకొలుకులకేసి విసరిపోవడం, చిరునవ్వుల్ని అతని మీసాల వదలి వెళ్లటం, ఎదురైతే తప్పుకొని తడబడి నడవటం, నడకల్లో ఏవో కొత్త వొంపులు మెరవటం – అతనిలో కదలికల్ని రేపాయి.

పనిచేసేటపుడు మగాడికి తగ్గని ఆమె బిగువు కండరాల సొగసు అతని మనస్సును లొంగదీసింది.

అప్రయత్నంగానే ఆమె చెమటలూరిన బాహుమూలల్లోకి – అతని చూపులు తూపుల్లా దూసుకెళ్ళేవి.

ఆమె పనికిరాని రోజంటూ లేదు.

నాలుగు రోజుల్లో వాళ్లు – పరస్పరం కడగంటి చూపుల్తో గిల్లుకోవటాన్నో, పెదాల ఎరుపుల వెనకనుంచి వచ్చే పళ్ల మెరుపుల్ని కనుపాపలకు అంటించుకోవటాన్నో, మరెలాగనో, యింకే విధానాన్నో – మాటలు కలపకుండానే బాగా పరిచయస్తులయ్యారు. అతనికిప్పుడు నవలల్తో పొద్దుబుచ్చుకోవలసిన అవసరం లేకుండా పోయింది.

ఉదయపు నీరెండలో నడచివచ్చే కూలీల్లో ఆమె కోసం అతని చూపులు ఆతృతగా వెదకేవి.

సాయంత్రం – ఇంటిదారి బట్టిన పశువుల గిట్టల కింది దుమ్ముమవల్ల మాసిన ఎండలో – వెనుదిరిగి వెళ్తోన్న కూలీల మధ్యనించీ, కంపచెట్ల చాటున్నించీ, వంక జేడెల వంపుల్లోంచి పదే పదే మెరిసి జారే ఆమె కళ్ల తళుకుల కోసం అలాగే నిల్చుని వుండేవాడు.

ఎఱ్ఱటి మూడు ఈకలున్న తోకతో ఒక చెట్టు మీంచి మరో చెట్టు మీదకు అందంగా ఎగురుతూ లోయకంతటికీ వింత అందాన్నిచ్చే కొండకోడిలా కన్పిస్తుంది అతని కళ్లకు– ఆమె.

రాగి పైరులో తప్పిపడి మొలిచి అందంగా పూచిన పొద్దుతిరుగుడు మొక్కలా వుంటుంది.

'రంగమ్మ'గా తెలిసిన ఆమె పేరును 'రంగి'గా మార్చి మననం చేసికొనే కొద్దీ ఎంతో తీయగా అన్పించింది అతనికి.

ఆమె కోసం అనుక్షణం ఇంద్రధనుస్సులై వంగే అతని చూపుల్ని కొందరు కూలీలు పసిగట్టారు.

ఒకనాడు మాటల సందట్లో ఆ విషయాన్ని సూచాయగా ప్రస్తావించాడు కూలీల పెద్ద ఓబయ్య.

మస్తాన్‌రెడ్డి తడబడి సర్దుకోబోయేసరికి తేలిగ్గా నవ్వేశాడు. "అదేం పతివ్రత కాదులే రెడ్డీ!" అన్నాడు. మొగుడున్నాడుట – అర్భకుడు.

ఓబన్నకేసి ఎగాదిగా చూశాడు మస్తాన్‌రెడ్డి. ఆ విషయాన్ని అంతటితో ఆపేసి బొగ్గుల బట్టీల సంగతి చర్చించాడు.

'గడుసు పిండమే' అనుకున్నాడు ఓబన్న మనస్సులో.

ఆ తర్వాత - రంగమ్మ మీది కోరిక మస్తాన్‌రెడ్డి మనసులో చిన్నపాటి తుఫానై కూచుంది. ఎదురుగా అల్లనేరేడు పండులా వూరిస్తోన్న ఆమె కోసం అతని అంతరంగం ఆకులా అల్లల్లాడసాగింది.

అంతలో తండ్రి వద్దనించి కబురొచ్చింది. బొంబాయి వాళ్లకు ఐదు లారీల బొగ్గు వొప్పుకున్నాడుట. తనవద్దనించి కనీసం మూడు లారీల బొగ్గును ఆశించాడుట, ఎందుకంటే యిక్కడ కర్ర అధికంగా ఉంది కాబట్టి.

ఓబయ్యతో సంప్రదించాడు.

రాత్రిళ్లు కూడా పని మొదలెడదామని చెప్పాడు అతను.

పగలంతా కర్ర తయారుచేయడం, రాత్రిపూట బట్టీలు పేర్చి అగ్గి పెట్టటం.

పని బాగా వూపందుకొంది.

పగలొచ్చే ఆడకూలీలు రాత్రి కూడా వస్తున్నారు, వంతుల ప్రకారం పన్జేస్తున్నారు. అర్ధరాత్రి వరకు సగం మంది. అర్ధరాత్రి నుంచి మరో సగం మంది.

ఆ రోజు పది గంటల దాకా బట్టీలు పేర్చారు. కర్ర కనబడకుండా, గాలి చొరబడకుండా మట్టి, బూడిదతో బట్టీని కప్పారు. కింద ఓ వైపున సన్నని రంధ్రం గుండా కిరోసిన్‌తో తడిపిన కర్ర పేడును అంటించి లోపలికి మంట తగిలించారు. అలా నాలుగు వైపులా అంటించారు.

బట్టి లోపల కర్ర అంటుకొన్నదని నిర్ధారణ అయింతర్వాత రంధ్రాల్ని పూడ్చేశారు.

కొట్టం ముందు మంచమ్మీద పడుకొని ఉన్నాడు మస్తాన్‌రెడ్డి.

ఆకాశంలోకి తదేకంగా చూస్తున్నాడు.

వెన్నెల వెలుగుల్లో కరిగే నక్షత్రాల్ని కళ్లకు లేపనంగా రాసుకొంటున్నాడు.

మంచి వెన్నెల.

పున్నమి వెన్నెల.

రంగమ్మ పలువరుసలాంటి వెన్నెల.

తలెత్తి బట్టీలకేసి చూశాడు.

వెన్నెల ముసుగులో నల్లమల కొండలు మత్తుగా పడుకొని ఉన్నాయి. కొండ పాదం వరకు వ్యాపించి వున్న కంపచెట్లు వెన్నెల వెల్లువలో పీకల్దాకా మునిగి ఉన్నాయి.

చేటతో బూడిద అందిస్తోంది రంగమ్మ.

బట్టీలమీద ఎక్కడా రంధ్రం పడకూడదు. గాలి లోపలికెళితే మంట బైటకొస్తుంది. ఆమేరకు కర్ర మొత్తం బూడిదవుతుంది. అందుకే బొగ్గుల బట్టీ వద్ద చాలా జాగ్రత్తగా ఉండాలి.

బట్టీలు పేర్చినవాళ్లు కొద్దిసేపట్లో పడుకోబోతారు. అప్పటిదాకా నిద్రించిన వాళ్లు లేచి బట్టీ వద్ద పనికి పూనుకొంటారు.

రంగమ్మ తనకేసి ఏదో సైగ చేసినట్లుగా అన్పించింది మస్తాన్‌రెడ్డికి. అది భ్రమగా కూడా ఓవైపు అనుమానంగా ఉంది.

ఆమె మీద అంతులేని ఆపేక్షగా ఉంది.

ఆ ఆపేక్ష కూడా ఆమె కల్పించేదేనేమో అన్పిస్తుంది.

వాళ్ల బిందెల్లోని నీళ్లు వేడెక్కాయని అప్పుడప్పుడూ పగటి పూట నీళ్లకోసం కొట్టంలోకొస్తుంది.

అందుకోబోతే జింకలా పరుగెడుతుంది.

దూరంగా పరుగెడుతూ ఉన్నా తనలోకి చొచ్చుకు వస్తున్నట్లుగా అన్పిస్తుంది. బట్టీ వద్ద బూడిద ఎగదోస్తూ ఉన్నా, తన గుండెల ముందు కూచుని నిప్పు రాజేస్తున్నట్లుగా క్షణక్షణానికి విసరే చూపుల్తో భ్రాంతి కలిగిస్తుంది.

ఏదోఒక క్షణంలో ఆమె తన వద్దకు వస్తుందనే ఆశ. తన్ను చేరుకొని, తనలో కరిగిపోకుంటే – ఆమె పడే తపనకు అర్థమేముంటుంది?

మెల్లిగా లేచి మంచాన్ని కొట్టంలోకి మార్చుకున్నాడు.

కనుపాపల నిండా రంగమ్మ కూచుని వుండటం వల్ల, రెప్పలు మూతలు పడటం లేదు.

బట్టీల వద్ద ఎవరో ఏల పదం అందుకున్నారు.

ఊరికి దగ్గరగా వంక జేడెల్లో నక్కలు సంగీత కచేరి మొదలెట్టినట్లున్నాయి. వాటి గానం వూర్లోకి వ్యాపించి వూరకుక్కల గొంతుల్లో ప్రతిధ్వనిస్తోంది.

తీతువు పిట్ట వొకటి దక్షిణం వైపునించి అదేపనిగా అరచుకుంటూ బట్టీల మీదుగా దూసుకెళ్లింది.

వాకిట్లో ఏదో ఆకారం ప్రత్యక్షమైంది.

తల తిప్పకుండనే ఓరగంట చూశాడు.

ఆవిడే...రంగమ్మ.

ఆవిడ గురించే ఆలోచిస్తున్నాడు. అకస్మాత్తుగా ప్రత్యక్షమయ్యేసరికి అతని మెదడు ఆలోచించటం మానేసింది.

అతనికేసి పట్టిపట్టి చూస్తూ వాకిట్లోంచి మెల్లిగా లోనికొచ్చింది ఆమె. అతను నిద్రిస్తున్నాడనే అనుకొంది.

మంచం వారగా లోపలికి నడుస్తూ ఉంది, మంచినీళ్ళ బానకేసి.

ఆమె చీర రెపరెపలు అరికాళ్లకుసోకి అతని గుండెల్లో పులకరింపుల జెండాలు మొలకెత్తాయి. పొగతో కూడిన ఆమె శరీరపు చెమట వాసన అతన్ని మత్తెక్కించింది.

మంచం దాటి లోపలి గదిలోకి నడిచింది ఆమె.

నీళ్ల కుండ మీద చప్పుడు.

తర్వాత నిశ్శబ్దం.

ఓ నిమిషం గడిచింతర్వాత మళ్లీ చిన్న శబ్దం.

సన్నని అడుగుల సవ్వడి ఆ గదిగుండెల్ని దాటి అతని గుండె గదుల్లోకి ప్రయాణించింది.

మంచం దగ్గరగా వస్తోంది ఆవిడ.

నరాలన్నీ బిగిసికొన్నాయి అతనికి.

శరీరమంతా ప్రకంపనల వలయమైంది.

ఆమె బైటకు జారుకొంటుందేమోననే భయం.

ఇంకా నిద్ర నటించటమో? లేక కళ్లు తెరిచి ఆమెను అడ్డుకోవటమో? - నిర్ణయించుకోలేని పరిస్థితి.

అతను డోలాయమాన స్థితిలో వుండగానే మొహమ్మీద చురుక్కున చల్లని నీళ్ళు విసిరికొట్టబడి ... చల్లదనం నాల్కలుచాచే మంటయి రక్తమంతా వ్యాపిస్తోంటే.... అప్పుడే నిద్ర లేచినట్లుగా మొహాన్ని చిట్లిస్తూ, కళ్ళు నులుముకుంటూ లేచి కూచున్నాడు.

"ఓవమ్మో... చెంబు వొలికింది..." అని గాభరాగా అంటూ అక్కణ్ణించి జారుకోబోయింది.

వెంటనే కదిలాడు అతను.

మంచమ్మీంచే కాలు అడ్డుంచాడు.

బోర్లాపడబోతోన్న ఆమెను ఒక్క గెంతులో చేరుకొని చేతి ఆసరా యిచ్చాడు.

అరచేతిలో చిక్కుకున్న ఆమె జబ్బకండల బిగువు అంతటి ఉత్తేజస్థితిలో కూడా అతన్ని ఆశ్చర్యపరచింది. విసురుగా దగ్గరకు లాక్కొంటోంటే "ఇప్పుడొద్దు, పొద్దుబోయి నాంక వస్తా!" అంటూ తప్పించుకుని జింకలా పరుగెత్తింది.

తర్వాత నిద్ర రాలేదు అతనికి. ఇంకొద్ది సేపటిలో అందుకోబోతోన్న అనుభవం రకరకాల రంగుల్లో కళ్ల ముందు అల్లుకొంటోంది.

తన గుండె లోయల్లో ప్రవహించే గోరువెచ్చని నెత్తుటిసెలయేరు ఆమెను నగ్నంగా స్నానానికి ఆహ్వానిస్తోంది.

మొదటి విడత కూలీలు పడుకొన్న ఓ గంటకు ఆమె రానే వచ్చింది.

లోకమంతా పరచుకొన్న వెన్నెల - ప్రవాహమై, వెల్లువై తన గుండెల మీద దూకినట్లనిపించింది అతనికి.

తీరాన్ని మింగేయాలని ప్రయత్నించే సముద్రంలా గర్జించింది ఆమె.

ఒకరి రక్తాని మరొకరు, ఒకరి ప్రాణాన్ని ఇంకొకరు మిగల్చకుండా తాగేశారు.

అలా మొదలయ్యింది. వాళ్ల శారీరక సంబంధం.

తనకు యింత మంచి సుఖాన్ని అందిస్తోన్న ఆమెకు కూలి డబ్బులు కాకుండా అదనంగా ఇవ్వబోయాడు ఒకనాడు.

"ఎందుకు?...." నొసలు చిట్లించింది.

"ఉంచుకో... మంచిచీర కనుక్కో. మంచి పౌడరు... ఏదొకటి..."

అతనికేసి సూటిగా, ఎగాదిగా చూసింది. "నీకాడ పడుకున్నందుకా?" అడిగింది.

"అబ్బే...." తడబడ్డాడు.

"మీ మొగోల్ల బుద్ధి పోనిచ్చుకున్నావు గాదు" అంటూ డబ్బు అతని ఒళ్లో విసరికొట్టింది. కొట్టంలో ఓ మూలగా మోకాళ్లలో తల దూర్చి కూచుంది.

అతని గుండె శబ్దం మారింది.

కొన్ని నిమిషాల తర్వాత తలెత్తి అతని కేసిచూసింది. "నేను రోజూ నీ మంచంలో కొచ్చేది లెక్కకేననుకున్నావు గదూ!" తల మళ్లీ మోకాళ్లలో దాచుకుంది.

ఎర్రబారిన ఆమె కళ్లు ధారాపాతమయ్యే దృశ్యం అతనికి కన్పించలేదు గాని, జీరబోయిన గొంతుక మాత్రం ఈమె స్థితిని పట్టించింది.

లేచి వెళ్లి ఆమె దగ్గరగా కూచున్నాడు అతను.

ఆమెను పొదవి పట్టుకొని కౌగిట్లోకి తీసికొన్నాడు. పెదాలతో కన్నీళ్లను తుడిచాడు. క్షమాపణల్ని ఆమె పాదాల ముందు కుప్పబోశాడు. ఆమెను కరిగించేందుకు తన గుండెల్ని కొలుములే చేశాడు.

కొద్ది సేపయింతర్వాత ఈమె నోరువిప్పింది.

"నీ జేబులో లెక్కచూసి నీ పక్కలో కొస్చాందనని అనుకొన్నెవు గదూ! నువ్వు నచ్చి వస్చాండ నీ వొల్లు నచ్చి వస్చాండ. నీ కాడ దొరికే సుగం నచ్చి వస్చాండ. ఆ ... నీలెక్క నచ్చిగాదు... నీ రెడ్డితనం నచ్చిగాదు..." అంటూ విసురుగా లేవబోయింది.

ఆమెకా అవకాశం ఇవ్వలేదు అతను. ఇలాగే ఇప్పుడే జీవితం ముగిసిపోయినా యిబ్బంది లేదన్నంత కాంక్షగా కౌగిలించుకొన్నాడు. మగ పుట్టుకకు జన్మ సార్థకమైనంతగా ఆలింగనం చేసికొన్నాడు.

ఓబయ్య కూడా మాటల సందర్భంలో చెప్పాడు. 'ఇప్పుడు రంగమ్మ ఇదివరకటిలా అక్కడా యిక్కడా ఆశించడంలే'దని, 'అతనొక్కణ్నే నమ్ముకొం'దని.

భయంకరమైన ఎండల్ని చిమ్మే నల్లమల కొండపాదం వద్ద వున్నట్లుగా లేదు మస్తాన్‌రెడ్డికి. నందనవనంలో విహరిస్తోన్నట్లుంది.

రోజులు గడుస్తున్నాయి.

వాళ్లిద్దరి సంబంధం బహిరంగ రహస్యమైంది.

ఆ రోజు రాత్రి - బట్టీల వద్దకెళ్లకుండా నేరుగా కొట్టంలోకే వచ్చింది ఆమె.

ఆవేశంగా - దగ్గరకు తీసికొందామని నడుం వంపుమీద చేయి వేసేసరికి వేళ్లకు గరుగ్గా తగిలింది చర్మం. వెంటనే "అమ్మా!" అంటూ మూలిగింది ఆమె.

"ఏమైంది?" ఆదుర్దా పడుతూ ఆమె ముందు గొంతుక్కూచొని టార్చిలైటు వెలుగులో ఆమె శరీరాన్ని పట్టి చూశాడు.

నడుమ్మీద జానెడు పొడవు ఎర్రగా కంది ఉంది. పై తోలు లేచిపోయి వుంది.

అతని మనస్సు విలవిల్లాడింది.

"చిక్కుడుకాయల కోసం పొదలో దూరినా. ఏదో పురుగు కనబడి బైటకు వురకబోతాంటే తీగెసుట్టుకొని తోలు వూడి వచ్చింది" చెప్పింది.

నమ్మబుద్ధి కాలేదు అతనికి. ఎవరో పచ్చిబఱ్ఱతో బాదినట్లుంది.

ఎంత ప్రయత్నించినా అదే సమాధానం.

మర్నాటి మధ్యాహ్నం ఓబయ్య వచ్చి గుసగుసలాడాడు "జాగర్త రెడ్డీ!" అంటూ.

"ఏం?"

"దాని మొగునికి తెల్సినట్టుంది."

"నా వొక్కని గురించేనా? నాకంటె ముందు ఎవ్వరి గురించీ తెలీదా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"వాల్లు వాల్లు ఒక వూరోల్లు....."

"అయితే?"

"ఏమో? నేన్జెబుతాండ. జాగర్త," అంటూ వెళ్లాడు అతను.

రంగమ్మ అబద్ధం చెప్పిందేమో అన్పించింది మస్తాన్‌రెడ్డికి.

ఓబయ్య వెలిబుచ్చిన అనుమానం మనస్సులో పురుగైంది.

రాత్రి తన మీద ఒట్టేసి అడిగాడు రంగమ్మను.... "నిజంగా ఆ దెబ్బ చిక్కుడు తీగతోనేనా?" అని.

అతని గుండెల్లో తలదూర్చి మౌనంగా వుండిపోయింది ఆమె. కొంతసేపటికి బనియన్ తడి అయ్యింది.

ఆమె తలను పొదివి పట్టుకొని తనకళ్ల ఎదుటికి తెచ్చుకొనేసరికి ఆమె కళ్లు ధారాపాతంగా వర్షిస్తూ కన్పించాయి.

"నిన్నెవరు కొట్టింది?" అడిగాడు.

"నా మొగుడు...."

ఉలిక్కిపడ్డాడు. ఆశ్చర్యంతో తల మునకలయ్యాడు. మొదట్నించీ ఆమె పోకడ అతనికి తెలుసట. అప్పుడెప్పుడూ కొట్టకుండా ఇప్పుడు చేయి చేసికోవటమేమిటి?

"తెల్సో తెలీకో నేనింతకు ముందు దగ్గరికి రానిచ్చిన నా బట్టలందరికీ ఇప్పుడు నా మీంద కన్ను గుట్టింది. నీతో సావాసం జేసినాల్నుంచీ వాల్లనెవర్నీ పలకరించలేదని నా మొగునికి లేనిపోని పౌరసం బోసిన్రు. ఏరూరోనికాడికి బోతాందెని ఎగదోసిన్రు. తోదుండి నన్ను కొట్టిచ్చిన్రు. నన్నెగతాలి జేస్కొ కూకున్నెరు" చెప్పింది ఆమె.

"ఇంత జరిగినా మల్లా నా కాడికి ఎట్లా వచ్చినవ్?"

"నన్ను సంపినా నీ కాడికి రాకుండా సాలియ్యనని చెప్పినా" అంది.

ఆమెనలాగే అక్కున చేర్చుకున్నాడు. అతని కళ్లెందుకో ప్రవహించే కాల్వలైనాయి.

కన్నీళ్లనీ, ఆనందాల్నీ కలబోసుకొని తాగటం కొత్త రుచిగా అలవాటైంది వాళ్లకి.

ఆమె భర్త ప్రవర్తనలో కూడా బాగా మార్పొచ్చింది.

ఇంతకు మునుపు ఎప్పుడయినా మస్తాన్‌రెడ్డి ఎదురైతే తలొంచుకొని తప్పుకు పోతుండేవాడు.

ఇప్పుడు కన్పిస్తే చాలు, చూపులకు ఎర్రగా పదను పెట్టి అతని పైకి గుప్పిస్తున్నాడు. తన్ను దాటి వెళ్లేంత వరకు వెనక్కి లాక్కోడు. ఎద్దులా బుసలు కొడుతూ, పళ్లు పటపట కొరుకుతూ అలాగే చూస్తుంటాడు.

నవ్వొస్తుంది మస్తాన్‌రెడ్డికి. మీసాలు మెలేసుకొంటూ వాణ్ణో పురుగులా చూస్తూ వెళ్తాడు.

ఆ రోజు ఆదివారం. కూలీలకు శెలవిచ్చారు.

పోరుమామిళ్ల వెళ్లి కావలసిన సామాను కొనుక్కోని సాయంత్రానికి తిరిగొచ్చాడు.

కను చీకటి పడగానే రంగమ్మ కోసం ఎదురు చూపులు మొదలైనాయి. చాలా సేపు నిరీక్షించకుండానే ఆమె వచ్చింది.

అప్పటికప్పుడు చిదుగులు రాజేసి అన్నం వండింది. కోడిగుడ్లు అట్లు పోసింది. ఇద్దరూ కలిసి సుష్టుగా భోంచేశారు. ఆరుబైట ఆకాశం కింద ఒకే మంచమ్మీద పడుకొన్నారు.

అర్ధరాత్రి కావొస్తోన్నా ఇద్దరి కళ్లమీద నిద్ర వాలలేదు.

ఆకాశంలో నక్షత్రాలు తెగ ముచ్చట్లాడుకొంటున్నాయి.

ఎక్కణ్ణించో తీతువు పిట్ట గొంతుచించుకొంటూ కొట్టం వేపుగా వచ్చింది.

కొట్టానికి ఉత్తరపు వైపు కంపపొదల్లోంచి పూరేలి 'బుర్' మంటూ లేచి దూరంగా మరో పొదమీద వాలింది.

దారి తప్పిన కుందేలి దాన్ని బెదరగొట్టినట్లుంది.

'ఇంతకీ.... కుందేలి దారెందుకు తప్పినట్లు?'

సద్దు చేయొద్దన్నట్లుగా ఆమెకు సైగ చేశాడు.

పొదల చాటున ఎండుటాకుల మీద మంద్రంగా పడుతోన్న అడుగుల చప్పుడు గాల్లో తేలుతూ వచ్చి చెవుల సోకింది.

చివుక్కున లేచి కూచున్నాడు.

టార్చిలైటు చేతికి తీసికొని చప్పుడైన దిశగా నడిచాడు.

అప్పుడే నెల పొడుస్తోంది.

పల్చటి వెలుతురు పొర లోకాన్ని కప్పేందుకు ప్రయత్నిస్తోంది.

కొంత దూరంలో పొదల చాటున్నించి బైటికొచ్చింది ఓ ఆకారం. ఎదురుగా మస్తాన్‌రెడ్డిని చూడగానే ఆగిపోయింది.

వెనగ్గా వచ్చిన రంగమ్మ మస్తాన్‌రెడ్డి వీపు వద్ద ఆగింది. అతని భుజం మీంచి ముందుకు చూడసాగింది.

టార్చి వెలుగును సూటిగా ఆ ఆకారం కేసి ఫోకస్ చేశాడు.

కళ్లకు చేతిని అడ్డుంచుకొన్నాడు వెలుతురు భరించలేక అవతలి వ్యక్తి.

"మా మొగుడే..." వెనకనించి చిన్నగా అంది రంగమ్మ.

"రేయ్! ఎవుడొరే వాడు? యీ జాంకాడ యీడి కొచ్చినవ్! ఏం పనిరా నీకు?" గద్దించాడు మస్తాన్‌రెడ్డి.

"ఊరకే...." అన్నాడు వాడు.

టార్చిలైటు వెలుగులో వాడి చేతిలోని వస్తువును చూసి ఉలిక్కిపడింది రంగమ్మ.

"రాత్రిల్లు ఏ జామున్నంటే ఆ జాముకాడ,.. వూరకూరకే తిరిగే అలవాటుందంటరా నీకు? ఫో.... యిక్కణ్నించి" తీక్షణంగా అన్నాడు.

కదల్లేదు వాడు.

పంచె ఎగగట్టి, వంగి, పట్టెడులావు పలుగురాతిని అందుకొన్నాడు మస్తాన్‌రెడ్డి. "పోతావా! రాత్తొ గొట్టమంటావా! ఒక్క దెబ్బకే సస్తవు నా కొడకా!" హూంకరించాడు.

వెనుదిరిగి వూరి వైపుగా కదిలాడు వాడు.

వచ్చి మంచమ్మీద కాళ్లు వేలాడేసుకొని కూచున్నాడు మస్తాన్‌రెడ్డి. రంగమ్మ ఎదురుగా వచ్చి నిల్చుంది.

"తెగించి వచ్చిండు బాగా నూరిపోసినట్టుంది" చెప్పాడు.

మౌనంగా నిల్చుంది.

"కూచో..." పిల్చాడు ఆమె కేసి చూస్తూ.

వెళ్లి అతని కాళ్లముందు గొంతుక్కూచుంది. మోకాళ్ల మీదకు లేచి అతని వొళ్లో తలాన్చి నడుమును కౌగలించుకొని పడుకొంది.

ఆమె వీపు నిమురుతూ ఉండి పోయాడు చాలాసేపు.

తర్వాత లేచినిల్చుంది ఆమె. "ఇంటికి పోతాండ" – చెప్పింది.

"ఎందుకూ"

"ఎందుకో...పోవాలనిపిస్తాంది..." అంటూ కదిలింది.

ఆమె వెనగ్గా వూరి వరకు వెళ్లొచ్చాడు అతను.

మంచమ్మీద వెల్లకిలా పడుకొన్నాడు.

ఆకాశంలో నక్షత్రాలు దిగివచ్చి కనుపాపల మీద చెడుగుడు ఆడుకొంటూ నిద్రను దగ్గరకు రానివ్వటం లేదు.

అలాగే నిశ్చలంగా పడుకొని ఉన్నాడు.

ఎప్పుడో తెల్లారు జామున రంగమ్మ వచ్చి తన వొంటిమీద వాతల్ని చూపించేంత వరకూ అతనిలో చలనం లేదు.

వాడు ఇంటికెళ్లి అతని మీద కసిని ఆమెపైన చూపించాడుట. అతని మీద ఉసిగొలిపిన వాళ్లే ఆవిడ మీదకు కూడా పంపారుట.

పిచ్చి పిచ్చిగా కొట్టాడుట.

రంగమ్మ వొంటి మీద వాడి పశుత్వాన్నిచూసి మహాకోపమొచ్చింది మస్తాన్‌రెడ్డికి. వాణ్ణి ఏ కీలుకాకీలు విరిచేద్దామనుకొన్నాడు.

అంతవరకు రాకుండానే వాళ్ల వ్యవహారం మరోమలుపు తిరిగింది.

మర్నాడే వాడు పంచాయితీ పెట్టించాడు.

రంగమ్మ ముందే వచ్చి పంచాయితీలో జరగబోయే విషయం యావత్తూ చెప్పింది. ఎలా వ్యవహరించాలో వివరించింది. ఆమె చెప్పిన పద్ధతి మస్తాన్‌రెడ్డికి నచ్చకున్నా మిన్నకున్నాడు.

'పంచాయితీకిర'మ్మని మనుషుల్ని పంపించారు కులపెద్దలు.

వచ్చిన వాళ్లు తన్నో నేరస్తుడిగా పరిగణించి మాట్లాడేసరికి, చర్రున మండింది అతనికి.

పంచాయితీకి వెళ్లడం మానుకున్నాడు.

రెండో విడత మళ్లీ వచ్చారు పెద్దమనుషులు.

"నేనేం తప్పు జేయలేదు. పంచాయితీకి రానవసరం లేదు" చెప్పాడు.

"తప్పు జేసినావనే అంటాండు వాడు."

"ఏం తప్పు? నాకూ వాని పెండ్లానికీ సంబంధమున్నమాట నిజమే. అంతమాత్రాన నేను తప్పు జేసినట్టా?"

"పరాయి ఆడదాన్ని సెడగొట్టడం తప్పేగదేం రెడ్డీ!"

"నేనేం సెడగొట్టలే... ఆమె కోసం వాండ్ల ఇండ్లల్లేకీ, చేలల్లేకీ నేను జొరబడలే. ఆమె కోరి నాకాడి కొస్తాంది. దగ్గిరికొచ్చిన ఆడదాన్ని ఎవరు పోనిస్తాడు చెప్పు? నువ్వొదుల్తావా? వాని పెండ్లాన్ని వాడు అదుపులో పెట్టుకోమను...." తీక్షణంగా చెప్పాడు.

"ఆ మాటే కులపెద్దలకాడ సెప్పుకొండూరా సోమీ!" అన్నాడు.

"మీ కులపెద్దల కాడికొచ్చి సంజాయిషీ సెప్పుకొనేంత ఖర్మ నాకులేదు. నేనురానుపో...." ఖచ్చితంగా చెప్పాడు.

వాళ్లు వెళ్లిపోయారు.

ఉదయం కూలీలు పనికి రాలేదు.

పది గంటలకంతా రంగమ్మ వచ్చింది.

అతన్ని పట్టుకొని గోడుగోడు మంది.

ఇదంతా ఆమె పాత ప్రియుల పన్నాగమట.

"మీ వూరికి పో... యాడున్నే నువ్వు సుగంగా వుండాలి. యీ పాపిస్టిదాన్నుంచి నీకు యాతనలు రాగూడు" చెప్పింది.

"నన్నెవరు పొడిచేది?" వ్యంగ్యంగా అన్నాడు.

"నిన్నేమన్లేక మా కులపోల్లు నన్ను నిలదీసిన్రు. నిన్నిక్కణ్ణించి పంపియ్యకుంటే నన్ను యింట్లిడ్సమన్నెరు. నీకాన్నే వుండమన్నెరు." ఏడుస్తూ చెప్పింది.

"ఉండు..."

అతని కళ్లల్లోకి సూటిగా సూసింది రంగమ్మ.

అయాయికుణ్ణిలా చూసింది.

"సెడిపొయ్యిందాన్ని, కులం తక్కువ దాన్ని, నన్నెంటపెట్టుకొని నువ్వెందుకుసెడిపోతవ్. మీ వూరికి పోయి పెండ్లిజేసుకొని సుగంగా బతుకు" గోడు గోడున ఏడ్చింది.

"నిన్నిడ్సి నేనెట్లా బతకాల?" అతని కంఠం వణికింది.

"నీకు తెల్దయ్యా! నువ్విడుండొద్దు. ఎప్పుడయినా పోవాల్సిందే గదా! కడుపు నిండిన కాడికి యీ సుగం సాలు. యీ సుగాన్ని గుండెల్నిండా పోసి పెట్టుకుందం. బతికినన్నాల్లూ కండ్ల మీంద సూసుకుంటా గడుపుదాం. నువ్వు పో సోమీ! నువ్వు పో...." రోదనల మధ్య అంది.

ఏదో భయం ఆమెను వెంటాడుతోంది.

అతని గుండె కరిగిపోయింది ఆమె ఆత్మీయతకు.

పగలంతా అన్నం మాట కూడా మరిచారు వాళ్లు.

ఆమె రాత్రి కూడా అక్కడే వుండి పోయింది.

ఎర్రబారిన కళ్లతో సూర్యోదయాన్ని చూశారు ఇద్దరూ.

నోట్లో పుల్లేసుకొని పళ్లు తోముకొంటూ వుంటే పోరుమామిళ్ల వైపు నించి ఎవరో వస్తూ కన్పించారు.

పరీక్షగా చూసి ఉలిక్కి పడ్డాడు మస్తాన్‌రెడ్డి.

బిరబిర కొట్టంలోకి నడిచాడు.

"నువ్వు పో... నువ్వు పో..." కంగారుగా చెప్పాడు రంగమ్మతో.

ఆశ్చర్యంగా చూసింది అతనికేసి.

"మా నాన్న వస్తాండు - ఓబయ్యను ఎనకేసుకొని" చెప్పాడు.

అతనికేసి తదేకంగా చూసింది ఆమె.

తర్వాత అక్కణ్ణించి జారుకొని వూరికేసి సాగిపోయ్యింది.

బొగ్గుల్ని గురించీ, బట్టీల్ని గురించి మస్తాన్‌రెడ్డితో మాట్లాడాడు అతని తండ్రి. ఇక్కడ జరుగుతోన్న నిర్వాహకాన్ని గురించి మాట వరసకు కూడా ప్రస్తావించలేదు.

'తెలీదేమో' అనుకున్నాడు.

తర్వాత ఓబయ్య చెప్పాడు 'తెలిసే ఆయన యిక్కడికొచ్చా'దని

మధ్యాహ్నంగా కొడుక్కి చెప్పాడు 'సగిల్లో పల్లెలకు వెళ్ల'మని.

ఇక తప్పలేదు మస్తాన్‌రెడ్డికి.

చివరగా ఆమెతో సుఖాల్నీ, కన్నీళ్లనీ పంచుకొనేందుక్కూడా సమయం లేక, దుఃఖంతో బరువెక్కిన గుండెను బలవంతంగా యీడ్చుకొంటూ ఆ తావు విడిచాడు.

బ్రహ్మంగారి మఠానికి అవతలున్న నేలటూరి వద్ద బట్టీలు కాల్పించటం మొదలెట్టాడు.

చాలా రోజులు, చాలా నెలలు ఆమె రూపమే అతని కనుపాపలకు అంటుకొని వుండేది. నిద్రలో వచ్చి తట్టి లేపినట్లే వుండేది.

కొప్పులోని గడ్డిపూల వాసన శరీరపు చెమట వాసనతో కలిసిన మధుర సమ్మేళనపు సుగంధం - చీకట్లు పడితే చాలు ఆమె స్మృతులతో కూడి వచ్చి ముక్కుపుటాలకు ఘాటుగా సోకేది. ఆమె వచ్చిందనే భ్రమిసేవాడు.

పెళ్లయినా, ఏళ్లు గడిచినా, ఇద్దరు పిల్లల తండ్రయినా, అప్పుడప్పుడు ఒంటరిగా పొలాల మధ్య తిరుగుతున్నప్పుడు ఏవైపు నించో ఆ వాసన వచ్చి సోకి మనస్సును పచ్చిపుండు చేసేది.

రాను రాను అదొక మధురమైన స్మృతిగా మిగిలిపోయింది.

తండ్రి ముసిలివాడై పోవటం వల్ల వ్యాపారమంతా మస్తాన్‌రెడ్డి భుజాల మీద పడింది.

దాదాపు పదేండ్ల తర్వాత అతను మళ్ళీ సావిచెట్టు పల్లె ప్రాంతంలో అడుగుపెట్టాడు.

తనెరిగిన మనిషి, తనంటే ప్రాణమిచ్చే మనిషి అక్కడొకటుందనే వూహ అతన్నెంతో ఉత్తేజితుణ్ణి చేసింది.

ఆ వూరేం మారలేదు.

ఆ బరకలు, ఆ రేగుచెట్లు, ఆ కొండ పాదాలూ, ఆ మనుషులూ... అందరూ పదేళ్ల క్రితం లాగే వున్నారు.

రంగమ్మ కూడా మారి వుండదనే అతని విశ్వాసం.

ముదివగ్గయిన ఓబయ్యను కలిసికొని బొగ్గుల విషయం మాట్లాడుతోంటే మొట్టమొదట తెలిసిన విషయం 'రంగమ్మ పతివ్రత ఐం'దని.

ఆశ్చర్యమేసింది అతనికి

పాముకాటు వల్ల భర్త చనిపోయి రెండేళ్లయిందట.

పతి పోయింతర్వాత పతివ్రత అయ్యిందట.

ఇది మరీ విడ్డూరంగా ఉంది.

బొగ్గు కాల్పించటం మొదలెట్టిన నాలుగోరోజు కూలీల మధ్యన అతని కంటబడింది రంగమ్మ.

బొట్టు కాటుక లేని మొహంతో, గాజుల్లేని చేతుల్తో తెల్లటిచీరలో వొదిగి వుంది. వేషం మారివుంది గాని శరీర సౌష్టవం చెడిపోలేదు.

మీసాలు మెలేస్తూ ఓరగా చూశాడు.

చిరునవ్వుతో పలకరించింది.

అతని శరీరం శృతిజేసికోసాగింది.

ఆమెను పునరుద్ధరించాలనే తపన మొదలైంది అతనిలో.

సాయంత్రం దాకా అతనికి తన్ను పలుకరించే అవకాశం కూడా యివ్వలేదు ఆమె.

దూరదూరంగా తప్పుకు తిరుగుతోంది.

మళ్లీ రోజు మధ్యాహ్నం ఆమెను ఒంటరిగా దొరకబుచ్చుకొన్నాడు అతను. రెక్కపుచ్చుకొని వంకజేడెల్లోకి లాక్కెళ్లాడు.

అతని చేతిని విదిలించి వదిలించుకొంది రంగమ్మ.

"ఏంటి? ఏంటిలా తయారయ్యావు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నాతో మాట్లాడొద్దు. నా జోలికి రావొద్దు. నేను లోగడి మాసిని కాదు" అంటూ పైటను బుజాలమీదకు లాక్కొని ముడుచుకుపోతూ వెనక్కి తిరిగి వెళ్లబోయింది.

అతను అడ్డంగా నిల్చుని ఆమెను కౌగలించుకునేందుకు ప్రయత్నించాడు.

రెండు చేతుల్తో అతన్ని దూరంగా నెడుతూ... "సెప్పిన గదా! – నేన లోగడి రంగమ్మను గాదని, నా మానాన నన్ను పోని...నాకీ పనులు నచ్చవు" చెప్పింది.

"నీకేమిటి? యీ నీతులేమిటి? – పచ్చి పతివ్రతలాగ. అదీ నా ముందర...." పకపక నవ్వుతూ అన్నాడు.

అతనికేసి కోపంగా చూసింది రంగమ్మ "నువ్వయి బతికి పోయావు, వేరే వాడయి వుంటేనా..." అంటూ ఒక దీర్ఘ శ్వాసతో ఆవేశాన్ని అణచుకొంది.

ఈ తీక్షణతకి తట్టుకోలేకపోయాడు అతను.

ఆమె ప్రవర్తనని జీర్ణం చేసికోలేక పోయాడు.

"పూర్వపు బంధాన్ని గుర్తు జేసుకొంటే నేనిట్లా జెయ్యండలో తప్పేమీ లేదు. నువ్విట్లా ఎందుకు తయారయ్యావో నా కర్థం కాలేదు. మొగుడుండి అప్పుడు యిబ్బందుల పాలయినం, మొగుడు లేకపోవడం వల్ల నీకిప్పుడు మంచి అనుకూలం గదా! నువ్వెందుకు వద్దంటున్నావో నాకయితే అంతుబట్టడంలే, నువ్వు 'వూ' అంటే మనకిప్పుడు ఎంతో మజాగా వుంటుంది గదా!" అన్నాడు.

అతనికేసి కొద్ది క్షణాలు కళ్లార్పకుండా చూసింది ఆమె.

"ఏమంటావ్?" నొసలెగరేశాడు.

"మీ మొగోల్లంటే నాకు వాంతి కొస్తాంది....థూ!" అంది.

ఉలిక్కిపడ్డాడు.

"నా బొట్టు బావుందెన్నోల్లే...నా గాజుల్తో ఆడుకున్నోల్లే.... నా పౌడరు మొగాన్ని కుక్కలట్టా నాకినోల్లే... నా మెట్టెల పాదాలకు వారుబోసి కావిలున్నోల్లే... మీ మొగోల్లే...మీ మొగోల్లే.... నేను దగ్గెరికి రానీలేదని, నా మొగుడు సావంగనే నన్నూ సంపిర్ను. తాలిబొట్టు తెంచిర్ను. తలరాత మార్చిర్ను. నా ఆకారాన్ని జూసి నవ్వుకొన్నెరు. నా ఎదురుగా ఏమీ సెయ్యలేని నా బట్టలు నా మీంద యిట్టా కసి దీర్చుకొన్నెరు...యీల్లంతా మీ మొగోల్లే...మీ మొగోల్లే..." – ఆయాసంగా ఆగింది.

"మొగుడున్నెపుడు అద్దం ముందు నిలబడి పౌడరు పూసుకొని బొట్టు కాటుక పెట్టుకొని, తల్లోపూలు ముడుసుకొని నన్ను నేనే సూసుకొంటాంటే నాకే ముద్దొచ్చేది. కోరికలు రేగేవి. పిచ్చ బెట్టేందుకే పెండ్లామనుకొనే నా మొగున్ని జూసి 'థూ' అనుకొనేదాన్ని. నా అందానికి సరైన జోడుగా ఎవురెవుర్నో కోరుకొనే దాన్ని...ఇప్పుడవన్ని ఏమీ లేవు. అద్దమ్ముందు నిలబడ్తే – నా అందాన్ని సెరిపేసిన మొగోల్లే కనబడ్తరు. ఏ మొగోని మొగమూ పారజూడ బుద్దిగారు. ఆ కోరికలే సచ్చినయి" – చెప్పింది.

"నేను అందరల్లాంటి మొగోన్ని కాదు నా సంగతి నీకు తెల్దా?" అన్నాడు మస్తాన్‌రెడ్డి.

"అందరికంటే అద్వాన్నాపు మొగోనివి నువ్వే" చెప్పింది.

అదిరిపడ్డాడు అతను.

"సిలమాకనో, దానికనో దీనికనో... ఈ పదేండ్లలో ఎన్నిసార్లు పోరుమాల్లకొచ్చింటి. నీ కోసరం మనిసి మనిసినీ యాధి యాదినీ గుచ్చి గుచ్చి సూసి సూసి కండ్లు కాయలు గాసినయి, నువ్వొక్కసారన్నా యీ పక్కకొచ్చినావా? కండ్లెత్తి యీ పల్లెకేసి సూడనన్నా సూసినావా?"

"అదీ... అదీ..." మాట పెగల్లేదు అతనికి.

"ఉడుకు సల్లార్చుకోడానికి నీకొక ఆడమాసి గావాల. దానికి వొల్లంతా కండలుండాల. కండల కింద ఉడుకుడుకు నెత్తర దండిగా వుండాల, మనసుండగూడ్దు. నేనయినా అంతే. నీ పెండ్లామయినా అంతే..."

"అట్టనగాకు..."

"అనేదేముందీ. అంతే... నీకు నా మీంద కామం దప్ప ప్రేమలేదు..."

"పొరబాటు పడగాకు. నువ్వంటే పడిసచ్చేవాన్ని. గుర్తు దెచ్చుకో...."

నవ్వింది రంగమ్మ – "అంత యిది వున్నోనివైతే ఒక్కనాడన్నా పిడికెడు పూలు దెచ్చిచ్చినవా? జానెడు రైక గుడ్డ దెచ్చినవా? ఒక్క పొదరు డబ్బా కొనిచ్చినవా?" అంది.

"లెక్కియ్యబోతే నువ్వే తీసుకోలే"

"ఆన్నే తెల్సిపోయ్యింది నీ కత. నా కాడ పండుకొన్నె మోహానికి నువ్వు లెక్కియ్యబొయ్యినవు. ప్రేమున్నోనివయితే ఏమైనా వస్తువులు తెచ్చియిచ్చేవానివి...."

నోట మాట రాలేదు మస్తాన్‌రెడ్డికి.

'ప్రేమకు, మోహానికి మధ్య అంత సన్నని పొరా?'

నిజమే... ఆమె కోసం పోరుమామిళ్ల పోవటం.... అంగళ్లు తిరిగేప్పుడంతా ఆమెను గుర్తు దెచ్చుకోవటం, కొనబోయే వస్తువునిండా ఆమెను చూడటం, ఆమెను కళ్లలో నింపుకొని ప్రయాణించటం.... వస్తువులు కొన్ని తెచ్చివ్వటం ప్రేమే. డబ్బిచ్చి ఆమెను కొనుక్కోవటం మోహంతో చేసిన పనే....

ఆమె పట్ల తను చేసిన పొరబాట్లు కూడా కొన్ని గుర్తుకు వచ్చాయి అతనికి. అవన్నీ తను మగాడిననే అహంతో చేసినవే. పెద్దమనుషులు పంచాయితీకి వచ్చినప్పుడు అంతా ఆమె తప్పుగానే మాట్లాడాడు. ఆమె శారీరకావసరాల కోసం తన దగ్గరకు వస్తున్నట్లుగా చెప్పాడు.

ఇప్పుడు కూడా ఆమెను మగ అహంకారంతోనే అడ్డుకున్నాడు. ఆమె ప్రాతివ్రత్యాన్ని గురించి హేళన చేశాడు.

"తప్పు నాదే, చెంపలేసుకొంటా, యిప్పున్నించయినా మనిద్దరం సావాసంగా వుందాం."– చెప్పాడు దీనంగా.

తల అడ్డంగా వూపింది ఆమె.

"ఆడ మగ సావాసం జెయ్యాలంటే శరీరాలన్నా కలవాల, మనసన్నా కలవాల, శరీరాలు కలవాలంటే ఎవరి వొల్లు మీద వాల్లకు కోరికలుండాల. నా వొల్లు మీద నాకు కోరికల్లేవు. మీ మగాల్లెప్పుడో సంపిర్రు. మనస్సంటావా అది నీకు లేదు. మనమెట్టా సావాసం జెయ్యాల?" చెప్పింది.

"మగతనమొక్కటే ఆడమగల నడుమ సంబంధాల్ని ఎల్లకాలం నిలుపుతుందనుకోకు. అది ఆ రవ్వొంత ఉడుకున్నె దాకానే. నీ పెండ్లాన్నయినా నీ మీసాలకు కట్టుకొని సంసారాన్ని యీదాలని సూడగాకు, గుండెల్లో కూకోబెట్టుకో... ఏడెనిమిదేండ్ల సంసారంలో నీకీ సంగతి అర్థమయ్యే వుంటుందేమో" చెబుతూ బట్టీలకేసి కదిలింది.

"రంగమ్మా.... రంగమ్మా..." వెనుక కదిలాడు.

"నీకు బుద్ధిరాదయ్యా," వెనుదిరిగి చెప్పింది - "నేనిప్పుడు కుదురుగా బతుకు తాండ. నా మానాన నన్ను బతకనీ, దండాలయ్యా మీ మొగాల్లందరికీ పేరు పేరున దండాలు... గంపెడు గంపెడు దండాలు...." అంటూ అక్కణ్ణుంచి వేగంగా కదిలింది.

అతనక్కడే...ఆ వంకజెడెల్లోనే.... ముళ్లకంప నీడల్లో చతికిలబడ్డాడు.

దూరమవుతున్నకొద్దీ రంగమ్మ ఆకారం పెద్దదిగా పెరుగుతూ కన్పించసాగింది.

తనతో కలిసిన యీ మగ ప్రపంచం ఆమెను నిలువునా నరికి బట్టీలో కూరి బొగ్గుగా మార్చింది.

ఇప్పుడా బొగ్గు తనకు పుటం పెట్టింది.

*◆ రచన మంత్లీ–అక్టోబర్, 2000 ◆*